సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శనివారం | 25 | మే | 2024



అంతర్జాతీయ ప్రమాణాలతో సౌకర్యాలు

కాజీపేట జంక్షన్‌లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు డీఆర్‌ఎం భర్తేష్‌కుమార్ జైన్ తెలిపారు. - 8లో▸



కేసీఆర్ కుటుంబమే పెద్ద బ్లాక్‌మెయిలర్

కేసీఆర్ కుటుంబం కంటే పెద్ద బ్లాక్ మెయిలర్ రాష్ట్రంలో ఎవరూలేరని మంత్రి సీతక్క అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$42^0/31^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి వాతావరణం ఎండగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత ఉంటుంది. సాయంత్రం సమయంలో వేడి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పాలిసెట్ ప్రశాంతం



రామన్నపేట: పాలిసెట్–24 పరీక్ష జిల్లాలో శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లా నుంచి 3,100 మంది పురుషులకు గాను 2,829 మంది విద్యార్థులు, 2,524 మంది అమ్మాయిలకుగాను 2,292 మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా కో–ఆర్డినేటర్ బైరి ప్రభాకర్ తెలిపారు. 5,624 మంది విద్యార్థులకు గాను 5,121 మంది హాజరై.. 91.05 హాజరు శాతం నమోదైనట్లు తెలిపారు. వరంగల్, హనుమకొండ నగరాల్లో మొత్తం 12 పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈపరీక్షలకు ఎస్‌బీటీఈటీ నుంచి ప్రత్యేక పర్యవేక్షకులుగా కృష్ణవేణి పర్యవేక్షించినట్లు తెలిపారు.

నీటి పారుదలశాఖ ఇన్‌చార్జ్ ఎస్‌ఈగా ఓంకార్ సింగ్



హసన్‌పర్తి: నీటి పారుదలశాఖ వరంగల్ సర్కిల్ ఇన్‌చార్జ్ ఎస్‌ఈగా ఓంకార్‌సింగ్‌ను నియమించారు. ఈమేరకు శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇన్‌చార్జ్ ఎస్‌ఈగా కొనసాగుతున్న మహబూబాబాద్ ఎస్‌ఈ వెంకటేశ్వర్లును ఆ బాధ్యత నుంచి తప్పించడంతో రామగుండం నీటిపారుదల శాఖ డివిజన్–3లో ఈఈగా వ్యవహరిస్తున్న ఓంకార్‌సింగ్‌కు వరంగల్ సర్కిల్ ఇన్‌చార్జ్ ఎస్‌ఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈసందర్భంగా ఆయనను టీఎన్జీఓస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి బోకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీఓస్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజమౌళి, టీఎన్జీఓస్ హసన్‌పర్తి యూనిట్ అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు నవీన్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట అర్బన్: పదో తరగతిలో 7 జీపీఏ, ఆపైన సాధించిన హనుమకొండ జిల్లా విద్యార్థుల నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శుక్రవారం జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ అధికారి మధురిమ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

నిట్‌లో కృష్ణా రివర్ బేసిన్ స్టడీ సెంటర్



కాజీపేట అర్బన్ : వరంగల్ నిట్‌లో కృష్ణా రివర్ బేసిన్ స్టడీ సెంటర్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఐఐటీ కాన్పూర్‌లోని సీ గంగా అండ్ ఎమిరిటస్ ప్రొఫెసర్ వినోద్ థారే, నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ సంయుక్తంగా ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జలవనరుల, నది అభివృద్ధి, గంగా పునరుజ్జీవన శాఖ సౌజన్యంతో సెంటర్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. కృష్ణానది సమగ్ర పరిస్థితిని అంచనా వేయడంతోపాటు పునరుద్ధరణ, నిర్వహణకు ప్రణాళికలను సిద్ధం తదితర అంశాల అధ్యయనానికి సెంటర్ తోడ్పడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఐఐటీ కాన్పూర్, నిట్ వరంగల్, సూరత్‌కల్ కన్సార్టియంలు పరస్పరం ఒప్పందం కుదుర్చుకున్నాయని తెలిపారు. కార్యక్రమంలో నేషనల్ రివర్ కన్జర్వేషన్ డైరెక్టరేట్ జాయింట్ సెక్రటరీ ప్రదీప్‌కుమార్ అగర్వాల్, ఎన్సీడీ డైరెక్టర్ అశోక్‌బాబు, సైంటిస్ట్ శ్రీవాత్సవ, బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పరిశీలన



హన్మకొండ: వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఎన్పీడీసీఎల్ అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఎన్పీడీసీఎల్ సీజీఎం కె.కిషన్, వరంగల్ ఎస్‌ఈ మధుసూదన్ రావు, వరంగల్ టౌన్ డీఈ మల్లికార్జున్, ఏడీ శ్రీనివాస్‌రెడ్డి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి చేరుకుని విద్యుత్ సరఫరా తీరును తెలుసుకున్నారు. ఆస్పత్రి ఆర్‌ఎంఓ దీపక్‌తో విద్యుత్ సరఫరాపై చర్చించి సమస్యలు తెలుసుకున్నారు. ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే సమాచారమివ్వాలని, ఆస్పత్రిలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

డివైడర్ల నడుమ ఏపుగా పెరిగిన తుమ్మచెట్లు



● ప్రయాణం.. భయం భయం

కాజీపేట అర్బన్: కడిపికొండ నుంచి ఖమ్మం వెళ్లే బైపాస్ రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్లు దడ పుట్టిస్తున్నాయి. స్మార్ట్ సిటీ కూడళ్ల అభివృద్ధి అంటూ డివైడర్లను ఏర్పాటు చేశారు. వాటి మధ్యలో మొక్కలు నాటి వదిలేశారు. డివైడర్ల మధ్యలో మొలిచిన తుమ్మ చెట్లు ఏపుగా పెరిగిపోయాయి. కడిపికొండ నుంచి ఉన్న డివైడర్ల నడుమ నాటిన మొక్కల నిర్వహణను పట్టించుకోకపోవడంతో చాలా వరకు ఎండిపోయాయి. మరికొన్నింటి కొమ్మలు కత్తిరించకపోవడంతో ఇష్టారీతిన పెరగడంతో వాహనదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రహదారి వెంట రాత్రి వేళలో ప్రయాణించడానికి వాహనదారులు జంకుతున్నారు. రహదారి వెంట వీధి దీపాలు లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రాతికోట మెట్ల మార్గం రోడ్డు



● మత్తు మస్తు.. ప్రాణాలు సుస్తు

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేగేట్ ప్రాంతంలో గంజాయి మత్తులో యువత మునిగిపోయింది. పట్టపగలే ఖిలా వరంగల్ వాకింగ్ గ్రౌండ్, దూపకుంట రోడ్డులోని నిర్మానుష్య ప్రదేశాలు, కరీమాబాద్ ఉర్సు గుట్ట రంగలీల మైదానం, ఇతర ఖాళీ స్థలాల్లో గుంపులుగా చేరి మద్యం, గంజాయి తాగుతున్నారు. ఇదేంటని అడిగిన వారిపై యువకులు దాడులకు దిగుతున్నారు. చింతల్ బ్రిడ్జి నుంచి ఖిలా వరంగల్ మధ్యకోటకు వెళ్లే దారిలో విశాలమైన వాకింగ్ గ్రౌండ్‌తోపాటు మట్టికోట, రాతి కోట పరిసరాలు, ఉర్సు గుట్ట రంగలీల మైదానం, దూపకుంట రోడ్డులోని నిర్జీవ ప్రదేశాలను అడ్డాగా చేసుకుని ఆకతాయిలు, మందుబాబులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. రాత్రయితే వీరి ఆకృత్యాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది.

ఖాళీ స్థలాల్లో నిలిచిన మురుగు నీరు



● మురికి కూపం.. పారిశుద్ధ్య లోపం

హసన్‌పర్తి: నగరంలోని 56వ డివిజన్ వివేకానగర్ కాలనీ అస్తవ్యస్తంగా మారింది. ఈకాలనీలో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేదు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి విడుదలవుతున్న మురికి నీరు ఖాళీ స్థలాల్లోకి వచ్చి చేరుతోంది. దీంతో సమస్య ఉత్పన్నమవుతోంది. గోపాలపురంలోని దేవరాజ్‌కాలనీ నుంచి చివరి వరకు మురికి కాల్వ నిర్మాణానికి నిధులు విడుదలయ్యాయి. కార్పొరేషన్ అధికారులు సగం వరకే మురికి కాల్వ నిర్మాణం చేపట్టినట్లు స్థానికులు చెప్పారు. దీంతో ఎగువ ప్రాంతం నుంచి వచ్చే మురికి నీరు వివేకానగర్‌కాలనీలోకి చేరి ఏరియాలు కంపుకొడుతున్నాయి. దీంతో కాలనీవాసులు అనారోగ్యాల బారిన పడుతున్నారు. మురుగు నీరు నిల్వ ఉండడం వల్ల పలు ప్రాంతాల్లో బోర్ల ద్వారా నీరు కలుషితమవుతోందని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు.

ఇళ్ల మధ్యలో సంచరిస్తున్న పందులు



● పందుల గుంపు.. వ్యాధుల ముప్పు

మడికొండ: గ్రేటర్ విలీన గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించింది. మురుగు కాలువలో తీసిన చెత్తను తరలించకపోవడంతో చెత్త తిరిగి కాలువల్లోకి చేరుతోంది. పందులు సంచరిస్తుండడంతో దుర్గంధం వస్తోంది. 46, 64,వ డివిజన్ పరిధి గ్రామాల ప్రజలు వాపోతున్నారు. కొంత మంది పెంపకందారులు పందులను ఇళ్ల మధ్యలో వదిలి వెళ్తుండడంతో సమస్య మరింత తీవ్రమవుతోంది. ఇవి రోడ్లపై తిరుగుతుడడంతో వాహనదారులు గాయాలపాలవుతున్నారు. వర్షాకాలంలో సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో పందులు చనిపోయినా తొలగించే వారు లేక వారం పది రోజుల వరకు కంపును భరిస్తున్నారు. పందుల బెడదను తొలగించి, పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాలని విలీన గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నల్లా లేకుండా బిల్లు

కుళాయి ఉన్నా..
అదనపు 'అమృత్' నల్లా

- అదనంగా బిల్లులు చెల్లించలేమని ప్రజల వేడుకోలు
- బిల్లు కట్టాల్సిందేనని ఏఈల హుకుం





వరంగల్ అర్బన్: నగరంలో వేలాది ఇళ్లకు నల్లా లేకుండా బిల్లు వస్తోంది. ఒక ఇంటికి రెండు, మూడు చొప్పున నల్లా కనెక్షన్లు ఉన్నట్లు చార్జీలు విధించడంతో యజమానులకు గుబులు పుడుతోంది. నల్లా చార్జీలు పెద్ద ఎత్తున పేరుకుపోతున్నాయి. బల్దియా ఏఈలు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టకపోవడంతో కమిషనర్ పేరిట వినతి పత్రాలు అందజేస్తున్నారు. అయినప్పటికీ స్పందించకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాత నల్లాలతో పాటు కొత్త నల్లాల బిల్లులు కడితేనే తొలగిస్తామని ఏఈలు డిమాండ్ చేయడంతో నిరాశ నిస్పృహలకు లోనవుతున్నారు.

దొంగ నల్లాలు వదిలేసి..

నగరంలో బల్దియా అనుమతి లేకుండా సుమారు 8 వేల నల్లా కనెక్షన్ల నుంచి నీళ్లను అక్రమంగా తాగుతున్నారు. నల్లాలు ఉన్నట్లు ఎవరో కాదు బల్దియా ఇంజనీర్లు, మెప్మా ఆర్పీలు గుర్తించి, బల్దియా వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. ఈనల్లాలను క్రమబద్ధీకరిస్తే బల్దియాకు ఆదాయం సమకూరుతుంది. కానీ.. ఆ నల్లాల వైపు బల్దియా ఇంజనీర్లు దృష్టి సారించడం లేదు. దీంతో బల్దియాకు రావాల్సిన ఆదాయం గండి పడుతోంది.

లేని ఇళ్లకు, ఒకటికి బదులు 2, 3 కనెక్షన్లు..

అర్బన్ మిషన్ భగీరథ, అమృత్ పథకంలో భాగంగా నగరంలో సూమారు 60 శాతం కాలనీల్లో కొత్త పైపు లైన్లు ఏర్పాటు చేసి, నల్లా కనెక్షన్లు బిగించారు. వేలాది ఇళ్లకు నల్లా కనెక్షన్లు లేవు. కానీ.. నల్లా కనెక్షన్లు ఉన్నట్లుగా.. ఒకటికి బదులు రెండు, మూడు ఉన్నట్లుగా ఆస్తి పన్నుతో నల్లా బిల్లు వేశారు. కొత్త నల్లాల క్రమబద్ధీకరణలో ఏఈలు, మెప్మా రిసోర్స్ పర్సన్(ఆర్పీ) ఇష్టారాజ్యంగా నల్లాలను గుర్తించి 'ఆన్‌లైన్'లో నమోదు చేయడంతో భవన యజమానులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇంటికి ఒకే నల్లా ఉంటే రెండు, మూడు నల్లాలు ఉన్నట్లు చార్జీలు విధించడమేంటని అధికారులను నిలదీస్తున్నారు. బల్దియా గ్రీవెన్స్ సెల్‌లో పెద్ద మొత్తంలో ఫిర్యాదులు నమోదవుతున్నాయి. అసలే ఉన్న ఒక్క నల్లా కనెక్షన్ నుంచి నీళ్ల ప్రెషర్‌తో రావడం లేదని, రెండు, మూడు ఎందుకు పెట్టారని ప్రశ్నలు సంధిస్తున్నారు. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టకుండా ఎడాపెడా కనెక్షన్లను క్రమబద్ధీకరించారు. గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేస్తే క్షేత్ర స్థాయిలో విచారణ చేసి బిల్లు రద్దు చేస్తామని ఏఈలు పదే పదే పేర్కొంటున్నారు. కానీ.. విచారణ చేపట్టకపోవడంతో నెలనెలా బిల్లు పెరిగిపోతోందని భవన యజమానులు ఆందోళన చెందుతున్నారు. మహా నగర పాలక సంస్థ కమిషనర్ దొంగ నల్లా కనెక్షన్లను క్రమబద్ధీకరించి, లేని నల్లాలను, అదనంగా ఫీజులు వేసిన కనెక్షన్లను రద్దు చేసేందుకు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కమిషనర్‌కు ఇచ్చిన వినతుల్లో కొన్ని..

- రంగశాయిపేటకు చెందిన దొడ్డ శ్రీనివాస్ ఇంటి నెంబర్ 19-9-449/2 అతడి ఇంటికి ఉన్న నల్లా కనెక్షన్‌కు ఏటా బిల్లు కడుతున్నారు. అతడికి తెలియకుండానే అమృత్, మిషన్ భగీరథ కింద రెండు అదనపు కనెక్షన్లిచ్చి బిల్లు కట్టమంటున్నారు. కమిషనర్ స్పందించి సమస్యను పరిష్కారించాలని వినతి పత్రం ఇచ్చాడు.
- హనుమకొండ ఎన్‌జీఓస్ కాలనీ 2-4-1433 ఇంటి నంబర్‌కు నల్లా కనెక్షన్ ఉన్నా.. అదనపు నల్లా బిల్లు వస్తోంది. ఏఈకి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. అదనపు బిల్లులను మినహాయించాలని వినతి పత్రం ఇచ్చారు.
- సుందరయ్య నగర్‌కు చెందిన మురళికి 46-10-186 ఇంటి నంబర్ ఉంది. కానీ ఇంట్లో ఎవరూ ఉండడం లేదు. అతను నల్లా కనెక్షన్ అడగలేదు. కానీ ఇంటి పన్నుతో బిల్లు వస్తోంది. పరిశీలించి తొలగించాలని మురళి వినతిపత్రం ఇచ్చాడు.
- వరంగల్ 28వ డివిజన్ చెందిన 8-3-73/1 ఇంటికి నల్లా కనెక్షన్ లేకున్నా బిల్లు వస్తోందని, రద్దు చేయాలని జి.అనిత ఫిర్యాదు చేశారు.
- 15వ డివిజన్ మొగిళిచర్లకు చెందిన 48-2-28/ఎ ఇంటికి నల్లా లేకుండా బిల్లు వస్తుందని, మినహాయించాలని గనిపాక ఎల్లయ్య వినతి పత్రాన్ని అందజేశారు.
- మడికొండకు చెందిన కృష్ణమూర్తి ఇంటి నంబరు 30-8-18, నల్లా కనెక్షన్ నంబరు 85379 ఉంది. 2018 నుంచి మరో నల్లా, 2022 నుంచి ఇంకో నల్లా మొత్తం ఒకే ఇంటికి మూడు నల్లాలు ఉన్నట్లుగా చార్జీ విధించారు.
- కరీమాబాద్‌లోని అనంతలక్ష్మి 17-3-74 ఇంటికి నల్లా కనెక్షన్ ఉంది. అదనంగా మరో నల్లా, రెండు కనెక్షన్ల చార్జీ నెలకు రూ.300 చొప్పున 'ఆన్‌లైన్'లో చూపిస్తోంది.

కేసీఆర్ ఇల్లంతా దొంగల ముఠా

- నేను గంట వర్కవుట్ చేస్తే ఆర్‌ఎస్‌పీ దుకాణం బంద్
- కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న



మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న

హన్మకొండ చౌరస్తా: రెండు రోజుల క్రితం వరంగల్‌కు వచ్చిన డ్రామారావు తీన్మార్ మల్లన్న దొంగని అంటున్నాడు, కేటీఆర్ నీ అయ్య పాస్‌పోర్టుల బ్రోకర్, దుబాయ్ శేఖర్ అని ఎవరికి పేరుందో వెళ్లి అడుగు, కవిత సారా దందా ఇట్లా కేసీఆర్ ఇల్లంతా దొంగల ముఠా అని కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ధ్వజమెత్తారు. హనుమకొండలోని డీసీసీ భవన్‌లో శుక్రవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీగా పోటీ చేసేందుకు బీఆర్‌ఎస్‌లో అభ్యర్థే కరువయ్యారని, అమాయకుడు రాకేశ్‌రెడ్డిని తీసుకొచ్చారని ఎద్దేవా చేశారు. ఓయూలో ఎంసీజే, కేయూలో బీపీడీ, జేఎన్‌టీయూలో ఎంబీఏ చేశానని, వాళ్ల అభ్యర్థి బిట్స్ పిలానీ అట, ఇక్కడ చదువుకున్న వారు పల్లీ బఠాణీ అట కేటీఆర్ అహంకార పూరితంగా మాట్లాడుతున్నాడన్నారు. జూన్ 4 తర్వాత కేసీఆర్ కుటుంబం చంచల్‌గూడ, చర్లపల్లి జైలులో భజన చేసుకోవాలన్నారు. 'నా స్టూడియోకు వచ్చి నేను కడిగిన ముత్యమని నాడు చెప్పిన ఆర్‌ఎస్‌పీ ఇప్పుడు మల్లన్నపై కేసులు ఉన్నాయని చెబుతున్నాడు. నేను గంట వర్కవుట్ చేస్తే నీ దుకాణం బంద్ అయితది' అని హెచ్చరించారు. అంతకుముందు తీన్మార్ మల్లన్న గెలుపుకోసం తాను ఉపసంహరించుకున్నట్లు స్వతంత్ర అభ్యర్థి ముత్తులింగం తెలిపారు. అనంతరం హనుమకొండలోని జిల్లా గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులను కలిసి ఓటు అభ్యర్థించారు. సమావేశంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్, వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ, టీపీసీసీ అధికార ప్రతినిధి కత్తి వెంకటస్వామి, సభ్యులు బత్తిని శ్రీనివాసరావు, నమిండ్ల శ్రీనివాస్, కార్పొరేటర్లు పోతుల శ్రీమన్నారాయణ, విజయశ్రీ రజాలీ, నాయకులు బోడ డిన్నా, డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, ఎండీ అజీజ్‌ఖాన్, డాక్టర్ పులి అనిల్‌కుమార్, బంక సరళ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు షురూ



విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం పారంభమయ్యాయి. జిల్లాలో 24 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించారు. ఇంటర్ జనరల్, ఒకేషనల్ కలిపి 3,762 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 3,371 మంది హాజరైనట్లు డీఐఈఓ గోపాల్ తెలిపారు. మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు నిర్వహించిన ఇంటర్ సెకండియర్ జనరల్, ఒకేషనల్ కలిపి 1,369 మందికిగాను 1,235 మంది విద్యార్థులు హాజరు కాగా.. 134 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

వరంగల్ జిల్లాలో..

కాళోజీ సెంటర్: వరంగల్ జిల్లాలో శుక్రవారం నిర్వహించిన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షకు 71 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈఓ కె.మాధవరావు తెలిపారు. జనరల్ కోర్సుల్లో మొత్తం 1,132 మంది విద్యార్థులకు 1,067 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. ఒకేషనల్ కోర్సుల్లో 85 మందికిగాను 79 మంది హాజరైనట్లు ఆయన తెలిపారు.

పోలింగ్ రోజున 144 సెక్షన్

వరంగల్ క్రైం: ఈనెల 27న జరిగే వరంగల్–నల్లగొండ–ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల సందర్భంగా వరంగల్ కమిషనరేట్ పరిధిలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సందర్భంగా కమిషనరేట్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నిక ప్రశాంతంగా నిర్వహించేందుకు ఈనెల 27న ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ఈసందర్భంగా కమిషనరేట్ పరిధిలో బహిరంగ సభలు, ర్యాలీలు నిషేధమని, ఎన్నిక వేళ పోలింగ్ కేంద్రాల చుట్టూ గుమిగూడరాదని, పోలింగ్ కేంద్రం నుంచి 200 మీటర్ల హద్దును దాటి ఓటర్లు తప్ప ఎవరూ లోపలికి రావొద్దని సూచించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి పోలీస్ అధికారులు, సిబ్బందికి సహకరించాలని కోరారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

నెలాఖరు వరకు పనులు పూర్తి చేయండి

- హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్



దుస్తుల తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

హసన్‌పర్తి: అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు ఈనెలాఖరు వరకు పూర్తి చేయాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. హసన్‌పర్తి మండలంలోని బైరాన్‌పల్లి, హరిశ్చంద్రనాయక్ తండా, కొత్తపల్లి, అర్వపల్లి గ్రామాల్లో ఆయా పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో జరుగుతున్న పనుల్ని శుక్రవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. పాఠశాలల విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తులను తయారు చేస్తున్న బైరాన్‌పల్లిలోని మహిళా స్వశక్తి కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. నిర్ణీత గడువులోపు యూనిఫామ్‌లు అందించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ విద్యాలత, డీఆర్డీఓ నాగపద్మజ, ఎంపీడీఓ ప్రవీణ్‌తో పాటు ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం చేయొద్దు

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



అభివృద్ధి పనులు తనిఖీ చేస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్: అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఇంజనీర్లను హెచ్చరించారు. శుక్రవారం హనుమకొండ పరిధి పలు ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న ఇంజనీరింగ్ సంబంధిత పనుల్ని కమిషనర్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. సమర్థవంతంగా నిర్వహించేందుకు సూచనలిచ్చారు. హనుమకొండ పరిధి కుమార్‌పల్లిలోని ప్రభుత్వ ఉర్దూ పాఠశాల, ఉన్నత పాఠశాలతో పాటు అప్పర్ ప్రైమరీ స్కూల్ మచిలీ బజార్, ఉజిలిబేస్‌లోని గవర్నమెంట్ హైస్కూల్ (టీపీటీ), ఉర్దూ మీడియం పాఠశాల లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ అభ్యసన పాఠశాల, హనుమకొండ బస్టాండ్ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న ఇంజనీరింగ్ సంబంధిత పనులను ఆమె పరిశీలించారు. తనిఖీల్లో బల్దియా ఈఈ రాజయ్య, డీఈలు రవికుమార్, సంతోష్‌బాబు ఏఈలు హరికుమార్, మేనక రాగి శ్రీకాంత్, సరిత, అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్‌పర్సన్లు సునీత, రమాదేవి, వాణి, ప్రధానోపాధ్యాయులు జ్యోతి, శైలజ, సరళ, రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో పోలింగ్ కేంద్రం వివరాలు

కాళోజీ సెంటర్ : వరంగల్–నల్ల గొండ–ఖమ్మం ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక కోసం ఓటు హక్కు నమోదు చేసుకున్న వారు ఈసీ వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవచ్చని వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. పట్టభద్రులకు ఓటరు స్లిప్పులు అందించామని పేర్కొన్నారు. స్లిప్పులు అందని పట్టభద్రులు http://ceotelangana.nic.inలో చూసుకోవచ్చని తెలిపారు. ఈ వెబ్‌సైట్‌లో ఓటు హక్కుతోపాటు పోలింగ్ కేంద్రం తదితర వివరాలు అందుబాటులో ఉంటాయని కలెక్టర్ పేర్కొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకున్న 143 మంది..

ఎమ్మెల్సీ ఉపఎన్నిక విధులు నిర్వర్తించే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే గడువు శుక్రవారం ముగిసిందని కలెక్టర్ పి.ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్‌లోని ఎల్‌బీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో శుక్రవారం 143 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నట్లు ఆమె పేర్కొన్నారు.

నేటితో ప్రచారానికి తెర..

ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచారానికి శనివారం సాయంత్రం 4 గంటలకు తెర పడనుందని కలెక్టర్ పి.ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే ఈసీ నిబంధనల మేరకు చట్టరీత్యా చర్యలు ఉంటాయని ఆమె స్పష్టం చేశారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని సైలెన్స్ పీరియడ్‌లో ఎలాంటి బల్క్ ఎస్‌ఎంఎస్‌లు పంపకూడదని కలెక్టర్ సూచించారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కుటుంబ పార్టీలు

మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్



మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

హన్మకొండ: కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కుటుంబ, అవినీతి పార్టీలని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్‌యాదవ్ అన్నారు. శుక్రవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని డీ కన్వెన్షన్‌లో ఓరుగల్లు సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో ఇంటలెక్చువల్ మీట్ జరిగింది. మీట్‌కు మోహన్ యాదవ్ నేరుగా పాల్గొనాల్సి ఉండగా సాంకేతిక కారణాలతో హెలికాప్టర్‌లో రాలేకపోవడంతో వర్చువల్‌గా ప్రసంగించారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని, ఇక్కడ చాలదన్నట్లు ఆయన కూతురు కవిత ఢిల్లీలో మద్యం కుంభకోణానికి పాల్పడ్డారని దుయ్యబట్టారు. వరంగల్‌కు చెందిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు నరేంద్ర మోదీ ప్రభుత్వం భారతరత్న ఇచ్చి గౌరవించిందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. అంతకుముందు బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి భాష అభ్యంతరకరమన్నారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం అప్పుల పాలైందని ప్రతి ఒక్కరికీ తెలుసని, ఇది తెలిసి లంకె బిందెలున్నాయనుకుంటే ఖాళీ బిందెలిచ్చారని మాట్లాడడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.



వర్చువల్‌లో ప్రసంగిస్తున్న మధ్యప్రదేశ్ సీఎం

కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ బూతు ప్రసంగాలు రాజకీయాల్లో ఫ్యాషన్‌గా మారాయన్నారు. అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడుతూ పట్టభద్రుల సమస్యల కోసం పోరాడుతానని, తనను ఎమ్మెల్సీగా గెలిపించాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు, నాయకులు డాక్టర్ సమ్మిరెడ్డి, మురళీమనోహర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైల్వే ఉద్యోగుల సీసీఎస్ రుణాల పెంపు

కాజీపేట రూరల్: రైల్వే కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ (లిమిటెడ్) సీసీఎస్ (రైల్వే ఉద్యోగులు) సభ్యుల రుణాలు పెంచుతూ డైరెక్టర్ల మీటింగ్‌లో తీర్మానించినట్లు కాజీపేట రైల్వే సీసీఎస్ డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాస్ యాదవ్, కాజీపేట రైల్వే సీసీఎస్ కో ఆప్షన్ డైరెక్టర్ దేవులపల్లి రాఘవేందర్ శుక్రవారం తెలిపారు. సికింద్రాబాద్ సీసీఎస్ ముఖ్య కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సీసీఎస్ డైరెక్టర్ల బోర్డు మీటింగ్‌లో రుణాలను పెంచుతూ కమిటీ నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కాజీపేట నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీనివాస్‌యాదవ్, రాఘవేందర్ ఈ మీటింగ్‌లో పాల్గొన్నారు. సీసీఎస్ సభ్యులకు ప్రస్తుతం ఇస్తున్న జనరల్ లోన్ రుణం రూ.3లక్షలను రూ.4లక్షల వరకు, స్పెషల్ లోన్ రూ.5లక్షల నుంచి రూ.10లక్షల వరకు పెంచినట్లు తెలిపారు. పెంచిన రుణాలను జూలై 1వ తేదీ నుంచి అమలు చేస్తున్నామని, రుణాల వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

- భార్య పుట్టింటికి వెళ్లి రాకపోవడంతో ఘటన
- ఏడాదిక్రితం ప్రేమవివాహం చేసుకున్న జంట


నితిన్ మృతదేహం

హసన్‌పర్తి: కుటుంబ కలహాలతో పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగి రాకపోవడంతో మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నగరంలోని ఒకటో డివిజన్ పలివేల్పుల ఆనంద్‌నగర్ కాలనీలో శుక్రవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పలివేల్పులకు చెందిన గోలి నితిన్(25) నర్సంపేటకు చెందిన ఓ యువతి ప్రేమించుకుని ఏడాది క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరి కాపురం కొంత కాలం సవ్యంగానే సాగినా.. అనంతరం గొడవలు ప్రారంభమయ్యాయి. ఇటీవల భర్తతో గొడవ పడిన భార్య పుట్టింటికి వెళ్లింది. భార్య తిరిగి రావడం లేదని మనస్తాపానికి గురైన నితిన్ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం మార్చురీకి తరలించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో సౌకర్యాలు

- కాజీపేట రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు తనిఖీ చేసిన డీఆర్‌ఎం భర్తీష్‌కుమార్

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో ప్రారంభించిన అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథకం అభివృద్ధి పనులు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో చేపడుతున్నట్లు సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్‌ఎం) భర్తీష్‌కుమార్ జైన్ పేర్కొన్నారు. కాజీపేట జంక్షన్‌లో చేపట్టిన వరల్డ్‌క్లాస్ అమృత్ భారత్ రైల్వే స్టేషన్ స్కీం అభివృద్ధి పనులను శుక్రవారం డీఆర్‌ఎం తనిఖీ చేశారు. కాజీపేట రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వే వెయిటింగ్ హాల్స్, టాయ్‌లెట్స్, విశ్రాంతి గదులు, ఫుట్ ఓవర్ బ్రిడ్జితోపాటు జంక్షన్ ఎదుట ఉన్న సర్క్యులేటింగ్ ఏరియాలో జరుగుతున్న పనులను ఆయన తనిఖీ చేసి పనుల నిర్మాణం, నాణ్యత ప్రమాణాలపై అధికారులతో మాట్లాడారు. అభివృద్ధి పనుల్లో భాగంగా తొలగిస్తున్న కార్యాలయాలు, నూతన నిర్మాణాలను పరిశీలించి పలు చోట్ల మార్పులు, చేర్పులపై, వర్షం నీరు నిల్వకుండా ఉండేందుకు అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ ఏడీఆర్‌ఎం గోపాల్, వివిధ విభాగాల అధికారులు ఉన్నారు.


జనగామ రైల్వేస్టేషన్‌లో పనులను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం భర్తీష్‌కుమార్ జైన్


కాజీపేట జంక్షన్‌లో అధికారులకు సూచనలిస్తున్న డీఆర్‌ఎం

జనగామ రైల్వేస్టేషన్‌లో పనుల పరిశీలన

జనగామ: కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ స్కీంలో భాగంగా జనగామ రైల్వేస్టేషన్ ఆధునికీకరణకు సుమారు రూ.107కోట్ల వరకు బడ్జెట్ కేటాయించగా, మొదటి విడుత రూ.27 కోట్లతో పనులు కొనసాగుతున్నాయి. శుక్రవారం డీఆర్‌ఎం భర్తీష్‌కుమార్ జైన్ జనగామ రైల్వేస్టేషన్‌లో పనుల పురోగతిని పరిశీలించారు. లక్ష్యం మేరకు పనులు పూర్తి కావాలని ఆదేశించారు. పార్కింగ్, గ్రీనరీ, తదితర వాటికి సంబంధించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అందుబాటులో నూతన వంగడాలు

హన్మకొండ: రైతులకు అవసరమైన నూతన వంగడాలు అందుబాటులో ఉన్నాయని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకుడు డాక్టర్ ఆర్.ఉమారెడ్డి అన్నారు. వరంగల్ హైడిపల్లిలోని వరంగల్ వ్యవసాయ పరిశోధన స్థానంలో శుక్రవారం నిర్వహించిన విత్తన మేళాలో ఉమారెడ్డి మాట్లాడారు. అధిక దిగుబడులు ఇచ్చే, చీడపురుగులను తట్టుకునే నూతన వరి, కంది, పెసర విత్తనాలు వ్యవసాయ పరిశోధన స్థానంలో అందుబాటులో ఉన్నాయన్నారు. పంటల అవశేషాలు కాలపెట్టకుండా భూమిలోనే కలియదున్నాలని, పచ్చిరొట్ట పంటలను వేసుకుని భూసారాన్ని కాపాడుకోవాలని సూచించారు. అనంతరం శాస్త్రవేత్తలు వి.వెంకన్న, జి.వీరన్న, ఎస్.సంధ్య కిశోర్ మాట్లాడారు. వరిలో నేరుగా విత్తె పద్ధతి ద్వారా రైతులు సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చని తెలిపారు. పత్తి పంటలో అధిక సాంద్రత కలిగిన పత్తి ద్వారా మంచి లాభాలు సాధించవచ్చని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. పంట మార్పిడి విధానం ద్వారా మేలు జరుగుతుందన్నారు. పప్పు దినుసులు, నూనె గింజలు, కూరగాయల విస్తీర్ణం పెంచాలని సూచించారు. వరంగల్ జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్ మాట్లాడుతూ.. రైతులు నాణ్యమైన విత్తనాలు గుర్తింపు పొందిన డీలర్ వద్దనే తీసుకోవాలని, వాటికి సంబంధించిన రశీదు, ఇతర వివరాలు జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. జీలుగ విత్తనాలు రైతులకు రాయితీపై అందిస్తున్నామని తెలిపారు. రైతులు పంట బీమా చేయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా రైతులకు విత్తనాలు అందించి, రైతులకు అవసరమైన కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ దిలీప్ కుమార్, వ్యవసాయ శాఖ హనుమకొండ ఏడీ దామోదర్ రెడ్డి, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.


రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఉమారెడ్డి, ఉషాదయాళ్

నకిలీ విత్తనాలు, పురుగు మందులను అరికట్టాలి

వరంగల్: రైతులు సాగుకు సిద్ధమవుతున్న ప్రభుత్వ అనుమతిలేని, కాలం చెల్లిన విత్తనాలు, పురుగు మందులను రైతులకు అంటగట్టి సొమ్ము చేసుకునే ప్రయత్నాలు చేస్తున్న వ్యాపారులు, ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్‌రావు కోరారు. శుక్రవారం తెలంగాణ రైతు సంఘం నాయకులు వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝాను కలసి వినతి పత్రాలను అందజేసి, మాట్లాడారు. గత సంవత్సరం విక్రయించగా మిగిలిన బ్రాండెడ్ కంపెనీల విత్తనాలను అదే కంపెనీల పేరుతో ఇప్పుడున్న లాట్ నంబర్ వేస్తూ ప్యాకింగ్ చేసి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. ట్రూతఫుల్ లేబుళ్లను ప్యాకింగ్‌లపై అంటించి అమ్మకాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారని పేర్కొన్నారు. పైరు ఏపుగా పెరుగుతుందని, దిగుబడి బాగా వస్తుందనే నమ్మించి అనుమతి లేని బయో మందులను సైతం రైతులకు అంటగడుతున్నారని అలాంటివారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం స్పందించి పోలీస్ శాఖలోని నిఘా వర్గాలు, వ్యవసాయ శాఖ అధికారులను అప్రమత్తం చేసి విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల వ్యాపారుల హోల్‌సేల్, రిటేల్ దుకాణాల్లో, సరుకులు నిల్వలు ఉండే గోదాముల్లో తనిఖీలు చేపట్టి రైతులు మోసపోకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, సంపత్‌కుమార్, నర్సయ్య, గోపాలరావు, ఆనందరావు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకను గెలిపించుకుందాం

- కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్


న్యూరాయపురలో ప్రచారంలో పాల్గొన్న రవీందర్‌సింగ్

హన్మకొండ చౌరస్తా: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రభుత్వాన్ని ప్రశంసించే వ్యక్తిని కాకుండా ప్రశ్నించే గొంతుకను గెలిపించుకుందామని కరీంనగర్ మాజీ మేయర్, సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ పట్టభద్రులను కోరారు. హనుమకొండలోని కాకతీయ కాలనీ, కార్పొరేషన్ సర్కిల్, న్యూ రాయపుర ప్రాంతాలతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాల్లో శుక్రవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి గత బీఆర్‌ఎస్ సర్కార్ ఇచ్చిన సంక్షేమ పథకాలను పక్కన పెట్టిందని అన్నారు. తీన్మార్ మల్లన్న.. చోర్ మార్‌గా.. మారి ప్రభుత్వాన్ని ప్రశంసించే గొంతుగా మారాడని అన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో నాయకులు హరిప్రసాద్, అనిల్, పాషా, చిరంజీవి, జనార్దన్‌గౌడ్, తుల రమేశ్, శీలం ప్రవీణ్, గోపిరెడ్డి రాజు, అనురాం తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ కుటుంబమే పెద్ద బ్లాక్‌మెయిలర్

- రాష్ట్ర మంత్రి సీతక్క


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు: కేసీఆర్ కుటుంబం కంటే పెద్ద బ్లాక్‌మెయిలర్ రాష్ట్రంలో ఎవరూలేరని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. ములుగు మండలం ఇంచర్ల సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నిక సన్నాహక సమావేశంలో సీతక్క మాట్లాడారు. తాను ఎక్కడ మోసం చేశానో తనపై ఆరోపణలు చేస్తున్న దుర్మార్గులు, దోపిడీదారులు నిరూపించాలని సవాల్ విసిరారు. ఆదివాసీ మహిళ మంత్రిగా ఉండడాన్ని చూసి తట్టుకోలేకపోతున్నారని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాటకు కట్టుబడి సన్నాలుకు బోనస్ ఇస్తున్నామని, ఇక ముందు దొడ్డురకానికి కూడా ఇస్తామని తెలిపారు. 'పక్కదేశంలో చదువుకున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి గొప్పోడా.. మన మధ్యలో ఉంటూ ప్రజలు, నిరుద్యోగుల సమస్యలపై నిత్యం పోరాడుతున్న తీన్మార్ మల్లన్న గొప్పోడా..' అని సమావేశానికి వచ్చిన పట్టభద్రులను అడిగి సమాధానం రాబట్టారు. మల్లన్నను అర్ధరాత్రి అరెస్ట్ చేసి, కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేసినా ప్రశ్నించడం మానుకోలేదని అన్నారు. అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. ప్రతి విషయంలో ప్రశ్నించి అడ్డుతగులుతున్నాడని నన్ను అరెస్ట్ చేయించావు, మరి ఇప్పుడు నీ చెల్లి కవితమ్మ ఎందుకు అరెస్ట్ అయిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఉద్దేశించి తీన్మార్ మల్లన్న అన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిని ఎందుకు నిలబెట్టారో రాకేశ్‌రెడ్డికే తెలియదని, దుర్గమ్మ గుడిచుట్టూ మేకను తిప్పినట్లు అతన్ని తిప్పుతున్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో మాజీ ఎంపీ పోరిక బలరాంనాయక్, డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ధనసరి సూర్య, నాయకులు కూచన రవళి, గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, బానోత్ రవిచందర్, రాంరెడ్డి, రవి, వెంకటనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోరాడే నాయకుడు ప్రేమేందర్‌రెడ్డి

- రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్


సమావేశంలో మాట్లాడుతున్న కె.లక్ష్మణ్

రామన్నపేట: గత 40 సంవత్సరాలుగా నీతి, నిజాయితీతో ప్రజల కోసం పనిచేస్తూ, నిరుద్యోగుల సమస్యలపై శాసనమండలిలో ప్రశ్నించే గొంతుకైన బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా దేశాయ్‌పేట కేఆర్ గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలో పట్టభద్రులు ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్, ఎన్నికల ఇన్‌చార్జ్ పీఎల్ శ్రీనివాస్, కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, రత్నం సతీష్ షా, బాకం హరిశంకర్, వన్నాల వెంకటరమణ, మాజీ ఎమ్మెల్యేలు రాజేశ్వర్‌రావు, వన్నాల శ్రీరాములు, అల్లం నాగరాజు, కార్పొరేటర్లు కల్పన, స్వాతి, రంజిత్ పాల్గొన్నారు.

ప్రదీప్‌రావు ఇంటికి లక్ష్మణ్

కాశిబుగ్గ: నగర పర్యటనకు వచ్చిన లక్ష్మణ్ ఓ సిటీలోని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా ప్రదీప్‌రావు, రేణుక దంపతులు ఆయనకు స్వాగతం పలికి జ్ఞాపిక అందజేసి శాలువాతో సన్మానించారు.

జిల్లాల్లో క్రికెట్ అసోసియేషన్లను సంప్రదించాలి


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

నయీంనగర్: తెలంగాణ జిల్లాలలో తెలంగాణ క్రికెట్ అసోసియేషన్‌ను సంప్రదించకుండా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధికారులు ఏ చర్యలకు ఉపక్రమించినా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని టీసీఏ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఝెండల లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి ధరం గురువారెడ్డి, కోశాధికారి డాక్టర్ పి.విజయచందర్ రెడ్డి హెచ్చరించారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. హైదరాబాద్ తప్ప ఏనాడు తెలంగాణ జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధికి కృషి చేయని హెచ్‌సీఏ ఇప్పుడు జిల్లాల్లో స్టేడియాలను నిర్మాణం చేస్తామనడం బూటకమన్నారు. ఇన్ని సంవత్సరాలు జిల్లాల పేరు చెప్పి బీసీసీఐ నుంచి వందల కోట్ల రూపాయలు తీసుకుని అవినీతికి పాల్పడిన హెచ్‌సీఏ పాలకమండలి బాధ్యత వహిస్తుందా.. అని ప్రశ్నించారు. హెచ్‌సీఏలో గత 5ఏండ్లుగా లెక్కలు, ఫోరెన్సిక్ ఆడిట్ చేయలేదని, రంజీ ట్రోఫీలలో 24వ స్థానానికి పడిపోయిందని తెలిపారు. పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిన హెచ్‌సీఏ క్రికెట్ అభివృద్ధిపై దృష్టి పెట్టలేదన్నారు. వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి జైపాల్, సమీర్, నవరసం, ఆదిత్య, అలీమ్ తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్‌మెయిల్ చేసిన వ్యక్తికి కమ్యూనిస్టుల మద్దతా?

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ


విలేకరులతో మాట్లాడుతున్న రాణి రుద్రమ

హన్మకొండ: యూ ట్యూబ్ చానల్‌ను అడ్డు పెట్టుకుని బ్లాక్ మెయిల్ చేసిన వ్యక్తి తీన్మార్ మల్లన్న కమ్యూనిస్టులు ఎలా మద్దతు ఇస్తారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ ప్రశ్నించారు. శుక్రవారం హనుమకొండలోని బీజేపీ ఎన్నికల కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీనియర్ నాయకుడు రాఘవులు అవినీతికి పాల్పడ్డారని, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ వద్ద రూ.100 కోట్లు తీసుకుని 10 టీవీ చానల్‌ను ధారాదత్తం చేశారని తీన్మార్ మల్లన్న యూట్యూబ్ ద్వారా ప్రచారం చేశారని, ఈ ఆరోపణలకు ఆధారాలు చూపించాడా..? లేక తీన్మార్ మల్లన్న బ్లాక్ మెయిల్‌కు భయపడి మద్దతు ఇస్తున్నారా.. అనేది సమాజానికి చెప్పాలన్నారు. బ్లాక్ మెయిల్ చేసి మీ అవినీతి సొమ్ము నుంచి తీసుకున్న మొత్తాన్ని సీఎం రేవంత్‌కు ఇచ్చి టికెట్ తెచ్చుకున్నారా అని ప్రశ్నించారు. తాను కూడా కేటీఆర్ వద్ద డబ్బులు తీసుకుని స్థలం కొన్నానని ఆ చానల్ ద్వారా ప్రచారం, ఆరోపణ చేస్తే ఆధారాలు చూపించాలని, లేకపోతే చెప్పుతో కొడతానని హనుమకొండ చౌరస్తాలో ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇది జరిగి మూడేళ్లయినా ఆధారాలు చూపించలేదన్నారు. విజ్ఞులైన పట్టభద్రులు ఆలోచించాలన్నారు. ప్రజల పక్షాన పోరాడే బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని గెలిపించాలని ఆమె పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, నాయకులు తాళ్లపల్లి కుమారస్వామి, కొండి జితేందర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, రాజిరెడ్డి, నర్మెట శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రేమ విఫలమైంది.. అందుకే చనిపోతున్నా

- కుటుంబ సభ్యులకు వీడియో కాల్‌చేసి ఆత్మహత్య


బాదావత్ నవీన్ మృతదేహం

గూడూరు: ' నాప్రేమ విఫలమైంది. అందుకే చనిపోతున్నా' అంటూ ఓ యువకుడు తన కుటుంబ సభ్యులతో వీడియో కాల్‌లో మాట్లాడి ఆ తరువాత ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మచ్చెర్ల శివారు కొమురం భీంనగర్ అటవీప్రాంతంలో శుక్రవారం జరిగింది. పోలీసులకు మృతుడి తండ్రి కీర్యానాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నర్సంపేట డివిజన్ ఖానాపురం మండలం నాజీతండాకు చెందిన బాదావత్ నవీన్ (25) ఓ యువతితో ప్రేమలో పడ్డాడు. కానీ ఆ యువతి ఇటీవల నవీన్ ప్రేమను కాదంటుండడంతో మనస్తాపానికి గురయ్యాడు. దీంతో అతను గురువారం ఉదయం నాజీతండా నుంచి బయలుదేరి గూడూరు మండలం మచ్చెర్ల శివారు కొమురంభీంనగర్ అటవీ ప్రాంతానికి చేరుకున్నాడు. తన ప్రేమ విఫలమైందని, అందుకు తాను పురుగుల మందు తాగి చనిపోతున్నట్లు కుటుంబ సభ్యులకు వీడియో కాల్ చేసి చెప్పాడు. ఆ తరువాత పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే నాజీతండా నుంచి బయలుదేరి అడవికి చేరుకోగా నవీన్ అపస్మారకస్థితిలో పడి ఉండడాన్ని గమనించారు. వెంటనే గూడూరు సీహెచ్‌సీకి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. తండ్రి కీర్యానాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తేలుకాటుతో బాలుడి మృతి


తేలు కాటుతో మృతి చెందిన కిషన్‌సింగ్

ఎల్కతుర్తి: ఆరబోసిన ధాన్యంపై కప్పిన పరద తీస్తుండగా ఓ బాలుడికి తేలు కుట్టడంతో మృతిచెందాడు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెర గ్రామంలో శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఠాగూర్ కిషన్‌సింగ్(13) తన తండ్రి ఠాగూర్ శ్యామ్‌సింగ్‌తో కలిసి గ్రామ శివారులో ఆరబోసిన వరిధాన్యంపై కప్పిన పరదను తీస్తున్న క్రమంలో తేలు కాటువేసింది. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం 108వాహనంలో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న క్రమంలో పరిస్థితి విషమించి మృతి చెందాడు. బాలుడి మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

రిజిస్ట్రేషన్లు సులభతరంగా చేపట్టాలి

- జాయింట్ ఐజీ మధుసూదన్‌రెడ్డి


మధుసూదన్‌రెడ్డి, సుభాషిణిని సత్కరిస్తున్న రవి, అమ్జద్

కాజీపేట అర్బన్: భూక్రయవిక్రయదారులకు సులభతరంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ జాయింట్ ఐజీ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. వరంగల్ ఆర్వో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో శుక్రవారం వార్షిక తనిఖీలో భాగంగా జాయింట్ ఐజీ మధుసూదన్‌రెడ్డి రిజిస్ట్రేషన్, చిట్స్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఐజీ కార్యాలయంలో జాయింట్ ఐజీ మధుసూదన్ రెడ్డి, డీఐజీ సుభాషిణి జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి, సబ్ రిజిస్ట్రార్ అమ్జద్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు.

మనువాద రాజకీయాలతో రాజ్యాంగానికి ముప్పు

- సామాజిక విశ్లేషకులు భిక్షమయ్య


సదస్సులో మాట్లాడుతున్న బొజ్జ భిక్షమయ్య

నయీంనగర్: మనువాద రాజకీయాలతో రాజ్యాంగానికి ప్రమాదం ఉందని సామాజిక విశ్లేషకులు బొజ్జ భిక్షమయ్య అభిప్రాయపడ్డారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంటలెక్చువల్స్ ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం రాజ్యాంగ పరిరక్షణ సదస్సు ఫోరమ్ కన్వీనర్ ప్రొ.ఎర్రగట్టు స్వామి అధ్యక్షతన నిర్వహించారు. ప్రధాన వక్త బొజ్జ భిక్షమయ్య మాట్లాడుతూ.. ఒకే దేశం, ఒకే మతం, ఒకే సంస్కృతి అన్న నినాదమే మోసపూరితమైందన్నారు. బలహీనవర్గాలు, వెనుకబడిన మైనార్టీలకు రిజర్వేషన్లు ఉండకుండా కుట్ర పన్నుతున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చట్టసభలు 90రోజులు నడవాలని కాని 15రోజులే నడుస్తున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కోరారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని పిలుపునిచ్చారు. డాక్టర్ ప్రీతి దయాళ్ మాట్లాడుతూ.. రాజ్యాంగం రద్దు అయితే దేశంలో ప్రజాస్వామ్యం రద్దు అవుతుందన్నారు. ప్రొఫెసర్ వెంకటనారాయణ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజ్యాంగం మార్చాలనే వాళ్లను ఓడించాలని, ప్రజల గొంతుకగా నిలిచిన తీన్మార్ మల్లన్నను గెలిపించాలని గ్రాడ్యుయేట్లను కోరారు. ఈ సదస్సులో వివిధ సంఘాల నాయకులు రామబ్రహ్మం, ప్రొఫెసర్ వీరన్న, ఎండీ.రియాజ్, కత్తి వెంకటస్వామి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

'అసిస్టెంట్ రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేయాలి'

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్‌బాబును సస్పెండ్ చేయాలని కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం (అకుట్) డిమాండ్ చేసింది. ఈమేరకు అకుట్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి, ఎన్‌జీఓ బాధ్యులు, పార్ట్‌టైం లెక్చరర్లతో కలిసి కేయూ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డికి శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. యూనివర్సిటీ భూములపై డిజిటల్ సర్వేకన్నా ముందే కేయూలోని 229 సర్వే నంబర్‌లో అశోక్‌బాబు ఇల్లు ఉందని ఆయన భూకబ్జాకు పాల్పడ్డారని ఆరోపించారు. అలాంటి అశోక్ బాబు యూనివర్సిటీలో కీలకమైన అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా విధులను నిర్వర్తించటం ఎలా సాధ్యం అని ప్రశ్నించారు. అశోక్‌బాబు.. మాజీ వీసీతో కలిసి పరిపాలనను భ్రష్టుపట్టించారని ఆరోపించారు. గతంలో కేయూ ల్యాండ్ కమిటీలో ఉన్న అశోక్‌బాబును పాలకమండలి తొలగించిన విషయాన్ని ఇస్తారి రిజిస్ట్రార్‌కు గుర్తుచేశారు. అశోక్‌బాబు తాను పనిచేస్తున్న సెక్షన్ నుంచి తనకు తానుగా తొలిగిపోతే బాగుంటుందన్నారు. అశోక్‌బాబును సస్పెండ్ చేసి కొత్త అసిస్టెంట్ రిజిస్ట్రార్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. విషయాన్ని ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి బదులిచ్చారు. ఆచార్య బ్రహ్మేశ్వరీ, డాక్టర్ రమేశ్, డాక్టర్ ఎస్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

రైలుకింద పడిన జంట

- బాలిక మృతి, యువకుడికి తీవ్ర గాయాలు

కాశిబుగ్గ/ఖమ్మం క్రైం: ఓ జంట రైలుకింద పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటనలో బాలిక చనిపోగా, యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన వరంగల్, కాజీపేట రైల్వేస్టేషన్ల మధ్య పోతన జంక్షన్ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ కాశిబుగ్గకు చెందిన మేకమల్ల చెన్నకేశవ (19)కు, ఖమ్మం సారధినగర్‌కు చెందిన ఇంటర్ చదువుతున్న బాలిక(17)కు ఫోన్‌లో పరిచయమైంది. వీరు తరచూ ఫోన్‌లో మాట్లాడుతుండగా బాలికను తల్లిదండ్రులు మందలించారు. దీంతో ఆమె గురువారం ఇంట్లో నుంచి ఎవరికి చెప్పకుండా బయటకు వచ్చింది. శుక్రవారం సాయంత్రం 5.30 గంటల సమయంలో సుష్మ ఇంటికి ఫోన్ చేసి చనిపోతున్నా అని చెప్పి డౌన్‌లైన్‌లో వెళ్తున్న నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైలుకింద పడ్డారు. బాలిక అక్కడికక్కడే మృతిచెందింది. చెన్నకేశవ కాళ్లు తెగి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 ద్వారా చెన్నకేశవను చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్సై ఐలయ్య సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. బాలిక మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరచామని తెలిపారు. ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో బాలిక అదృశ్యం కేసు నమోదైందని సీఐ తెలిపారు.

అమ్మా చనిపోతున్నా.. నా కోసం వెతకొద్దు

'అమ్మా నేను చనిపోతున్నాను... నా కోసం వెతకొద్దు' అని చెప్పిన నిమిషాల్లోనే ఖమ్మంకు చెందిన బాలిక వరంగల్ – కాజీపేట మధ్య రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. శుక్రవారం రాత్రి బాలిక తల్లి ఖమ్మం పోలీసుస్టేషన్‌కు వచ్చి తన కుమార్తె ఆచూకీ విషయమై అక్కడి సీఐ రమేష్‌తో మాట్లాడుతోంది. అదేసమయాన ఆమెకు ఫోన్ చేసిన బాలిక 'నేను చనిపోతున్నాను.. నా కోసం వెతకొద్దు' అని చెప్పి కట్ చేసింది. దీంతో ఖమ్మం త్రీటౌన్ సీఐ రమేష్ లొకేషన్ ఆధారంగా వరంగల్ – కాజీపేట రైల్వే స్టేషన్ల మధ్య ఉన్నట్లు గుర్తించి ఖమ్మం ఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డికి సమాచారం ఇచ్చారు. ఆయన సిబ్బందిని అప్రమత్తం చేసి ఘటనాస్థలికి వెళ్లేలోగా బాలికతోపాటు ఉన్న యువకుడు రైలుకింద కిందపడ్డారు. బాలిక చనిపోవడంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది.